క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని రోటరీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శ్రీనగర్ కాలనీ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్–1 నుంచి 15 నంబర్ల రోడ్ల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: పల్లెకు పోదాం.. చలో చలో కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం నేలకొండపల్లి మండలం మల్లుపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మమత జనరల్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఖమ్మం, హైదరాబాద్ యశోద ఆస్పత్రి సౌజన్యంతో బాగం రంగయ్య మెమోరియల్ పాలిక్లినిక్ ఈ శిబిరాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు బాగం కిషన్‌రావు, కార్యదర్శి తేజావత్ సురేష్‌లు తెలిపారు. గుండె జబ్బులు, మెదడు, వెన్నుముక, నరాల వ్యాధులు,మూత్రపిండాలు,మోకాలు మార్పిడి, కీలు మార్పిడి, సాధారణ వైద్య విభాగం, శస్త్ర చికిత్స విభాగం, స్త్రీల వ్యాధులు, పిల్లలకు, కంటి వైద్యం, చెవి, ముక్కు, గొంతు విభాగం తదితర వాటికి ఉచితంగా వైద్యం అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాల్లో అభిషేకాలు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల సందర్భంగా నగరంలోని త్రీటౌన్‌లో గల రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో బాబాకు, గాంధీచౌక్‌లో ఉన్న వరప్రధాత షిర్డీ సాయి మందిరంలో సాయినాథునికి ఆవు పెరుగుతో అభిషేకం చేశారు. సాయంత్రం కుబేర పాశుపత, దశావతార హోమాలు నిర్వహించారు. హారతులు, నీరాజన మంత్ర పుష్పం, పవళింపు సేవ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్లు లగడపాటి రామారావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, సహాయ కార్యదర్శులు నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకటరమణ, కోశాధికారి కురువెళ్ల వెంకటజగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్ అందజేస్తున్న రిసోర్స్‌పర్సన్

కూసుమంచి: మండలంలోని 53 పాఠశాలలకు సమగ్ర సమాచార నమోదు నిమిత్తం ట్యాబ్‌లను మంజూరు చేయగా శనివారం ఎంఈఓ కార్యాలయంలో వాటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. మండలంలోని 12 ప్రాథమికోన్నత, 41 ప్రాథమిక పాఠశాలలకు వీటిని అందజేశారు.ఈ ట్యాబ్‌ల ద్వారా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, ఉపాధ్యాయుల హాజరు తదితర సమాచారాన్ని పొందుపర్చనున్నట్లు రిసోర్స్‌పర్సన్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, తులసి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


మేకలతండాలో కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చంద్రుతండా, మేకలతండా గ్రామాలలో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ నెల 26న ప్రజా సమస్యలపై నిర్వహించే ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, వెంకటేష్, మహేందర్, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	అశ్విన్స్
సాయిరాం	భీమదేవరపల్లి బ్రాంచి, కర్ణ
ఆదిత్య	మను చరిత్ర
శ్రీనివాస	1920

- ఖమ్మంగాంధీచౌక్

సర్వం..హరితమయం

మొక్కలు పెంపకంతో పచ్చగా మారిన పల్లెలు

- 30 రకాల మొక్కలతో నర్సరీల నిర్వహణ
- పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలకు అధిక ప్రాధాన్యం
- ఈ ఏడాది సుమారు 7.76 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం

సండే స్పెషల్

రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు పచ్చగా ఉండాలని, ఆహ్లాదకర వాతావరణం అంతటా విస్తరింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది. గత పాలకుల హయాంలో మోడువారిన ప్రాంతాలను సుభిక్షం చేసేందుకు తెలంగాణ సర్కారు ఓ యజ్ఞంలా ఊరూరా మొక్కలు నాటుతుంది. ఖాళీ ప్రదేశాల్లో లక్షల సంఖ్యలో మొక్కలు నాటడం, పెంచడం వంటి సంరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ.. బతికిన మొక్కలు శాతం తగ్గినా.. ఉన్న మొక్కలు చెట్లుగా ఏపుగా పెరిగి పల్లెలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. వచ్చే హరిత హారానికి సుమారు 7.76 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచేలా ప్రణాళికలు రూపొందించారు. పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.



రఘునాథపాలెంలోని పల్లెపకృతి వనం అందాలు (ఇన్‌సెట్) మినీ ట్యాంక్ బండ్ అంతర్భాగం

రఘునాథపాలెం: ప్రతి ఏడాది హరితహారం ఒక కార్యక్రమంగా ప్రభుత్వం తీసుకురావడంతో ఏటేటా నాటిన మొక్కలు ద్వారా గ్రామాల్లో పచ్చదనం ఉట్టిపడుతోంది. బడి, గుడి, ఆస్పత్రి, అంగన్‌వాడీ, చెరువులు, కాల్వలు, రోడ్లకు ఇరువైపులా ఎక్కడ ఖాళీ కనపడితే అక్కడ మొక్కలు నాటుతున్నారు. దీంతో మండలంలో లక్షలాది మొక్కలు నేడు వృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. దీనికితోడు పంచాయతీల పరిధిలో ప్రకృతివనం, మండల బృహత్తర పథకం ద్వారా ఖాళీ జాగాల్లో తీరొక్క మొక్కలు నాటి మినీ పార్కులుగా తీర్చిదిద్దారు. మొక్కలకు నీళ్లు అందించి సంరక్షించేలా ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్లు, ట్యాంకర్లు ఇచ్చారు. అయినా ఒకటి, రెండు చోట్ల నీటి ఎద్దడితో అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు పెరగకపోయిన అత్యధికంగా మాత్రం పల్లెలు నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

తీరొక్క మొక్కలతో..

హరితహారంలో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు చొప్పు ఇచ్చి నాటించడం, బతికించడం చేపడుతున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు కడియం మొక్కలను సైతం తీసుకొచ్చి తమ పంచాయతీల్లో నాటిస్తున్నారు. ఇలా నాటడంతో మండలంలోని పువ్వాడనగర్ ప్రధాన రోడ్డు నుంచి గ్రామంలోని రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి వనంలో కూడా ఆహ్లాదకరమైన మొక్కలు నాటించారు. ఇలా చింతగుర్తి, రఘునాథపాలెం, రేగులచలక, బూడిదంపాడు, చిమ్మపుడి, కోయచలక, శివాయిగూడెం తదితర గ్రామాల్లో నాటిన మొక్కలు ద్వారా పచ్చదనం ఉట్టిపడుతోంది.

7.76 లక్షల మొక్కలు సిద్ధం..

తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 40 నర్సరీల్లో సుమారు 7.76 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. గతంలో ఉన్న మొక్కలతో పాటు ఈ ఏడు నీడ, పండ్లు, కలప, పూలు, ఆకు మొక్కలైన వేప, గానుగ, అడవిబాదం, తంగేడు, మామిడి, కరివేపాకు, చింత, టేకు, సేరుడు, జామ, కర్జూర వంటి 30 రకాల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది టేకు మొక్కలకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిసింది. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ ప్రదేశాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారుల ఆదేశించగా.. పంచాయతీలవారీగా సిద్ధం చేస్తున్నారు.


పువ్వాడనగర్ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా వేసిన చెట్లతో పచ్చదనం

ఆరువేలకుపైగా మొక్కలు రక్షించాం..



కొత్తగా ఏర్పడిన పంచాయతీలో తొలి సర్పంచ్‌గా హరిత హారం కార్యక్రమం ద్వారా ఆరు వేల మొక్కలు నాటించాం. వందశాతం రక్షించుకోవడం ద్వారా వేసవిలోనూ మా పంచాయతీ పచ్చదనంలో కళకళలాడుతుంది. ప్రకృతివనంలో కూడా తీరొక్క మొక్కలను పెంచాం.

– కంపాటి లలిత రవి, సర్పంచ్, పువ్వాడనగర్

మొక్కల పెంపకం తృప్తినిస్తుంది..



నా పదవీకాలంలో గ్రామంలో పచ్చదనం పేరుతో మొక్కలు పెంచడం ఎంతో తృప్తినిస్తుంది. పల్లెపకృతి వనంలోనూ పలు రకాల మొక్కలను పెంచి రక్షిస్తున్నాం. చనిపోయిన మొక్క స్థానంలో వేరొక మొక్కను నాటుతున్నాం. ఈ మొక్కల పచ్చదనం గ్రామాల్లో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

– కొర్లపాటి రామారావు, సర్పంచ్, రేగులచలక

ప్రతీ పంచాయతీ పచ్చగా..



మండలంలోని 40 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనం ద్వారా నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటించాం. ఒకటి, రెండు పంచాయతీల్లో గుట్ట ప్రాంతాల్లో పెంచడం వల్ల వాటిలో ఎదుగుదల లోపించింది. ఈ ఏడు సుమారు 7 లక్షలకు పైగా మొక్కలు పెంచి సిద్ధం చేశాం.

– రామకృష్ణ, ఎంపీడీఓ, రఘునాథపాలెం

మాదక ద్రవ్యాలు ప్రమాదకరం

ఖమ్మంగాంధీచౌక్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఖమ్మం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రతినిధులు, షీటీం సభ్యులు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు యువత ఏ విధంగా బానిసలవుతున్నారో, దానివల్లకలిగే పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బాధ్యులు నరసింహారావు, భాస్కర్, షీటీం సభ్యులు హసన్ అలీ, భరోసా రాజకుమారి, చైల్డ్‌లైన్ ప్రతినిధి ధనలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

కూసుమంచి: విత్తన డీలర్లు రైతులకు ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర హెచ్చరించారు. శనివారం కూసుమంచిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే డీలర్లు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని, స్టాక్‌బోర్డులో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. జూన్ 18లోపు కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారు వానాకాలం రైతుబంధు పొందేందుకు వచ్చే నెల 3వ లేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు దరఖాస్తుతో పాటు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

తెల్దారుపల్లి విద్యార్థికి ర్యాంక్..

ఖమ్మంరూరల్: ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ (ఐఐటీ) ఫలితాల్లో ఎస్సీ విభాగంలో మండల పరిధిలోని తెల్దారుపల్లికి చెందిన పి.యశస్విని ఆల్ ఇండియా స్థాయిలో 2569వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకుంది. శనివారం ఈ మేరకు గ్రామ సర్పంచ్ ఎస్.కోటయ్య, గ్రామపెద్దలు తమ్మినేని వెంకట్రావు, సంగయ్యలు యశస్విని అభినందించారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శనివారం సీపీఎం ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకుని వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీటిని పాఠశాల నుంచి బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రచ్చా నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న, బెల్లం లక్ష్మి, బండి రామమూర్తి, మందడపు మురళీకృష్ణ, సిరికొండ వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు ఉధృతం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ కోరారు. శనివారం ఖమ్మం బైపాస్ రోడ్‌లో నిర్వహించిన ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 25 వరకు అన్ని జిల్లాల్లో, 26న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవీకే వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర కార్యదర్శి ఝాన్సీ, జిల్లా నాయకులు శ్రీనివాస్, కొమరయ్య, అరుణోదయ శ్రీను, కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు 'లింగంపల్లి'

ఖమ్మంరూరల్: వ్యవసాయ కార్మికుల సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేసిన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లింగంపల్లి వీరాస్వామి ఆదర్శప్రాయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం మండలంలోని తెల్దారుపల్లిలో జరిగిన వీరాస్వామి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.రమేష్, నంద్ర ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, బుర్రి ప్రసాద్, వి.నాగేశ్వరరావు, తమ్మినేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

రఘునాథపాలెం: హరితహారంలో భాగంగా అత్యధిక మొక్కలు నాటి రఘునాథపాలెం పంచాయతీని జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా నిలిపినందుకు శనివారం గ్రామ సర్పంచ్ గుడిపుడి శారదరామారావు గ్రామ వడ్డెర, యాదవసంఘాల ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ముందుందు గ్రామాభివృద్ధిలో అందరం తోడుంటామన్నారు.

భూమి పూజ..


భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరిలో నూతనంగా నిర్మించనున్న వైఎస్సార్‌టీపీ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటుకుశనివారం వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి, విగ్రహాల కమిటీ రాష్ట్ర సమన్వయకర్త నీలం రమేష్, రామసహాయం, నరేష్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, వైరా కోఆర్డినేటర్లు తుంపాల కృష్ణమోహన్, ధర్మసోత్ రామ్‌నాయక్, నాయకులు పసుపులేటి సైదులు, బత్తిని యాలాద్రి, వాలూరి, సత్యనారాయణ, వైవీడీ. రెడ్డి, స్వరూపారాణి, సురేష్‌రెడ్డి, ఉపేందర్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నేలకొండపల్లి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన వచ్చే నెల 2న ఖమ్మంలో చేపట్టే బహిరంగ సభను విజయవంతం చేయాలని పాలేరు ఇన్‌చార్జ్ మద్దినేని బేబి స్వర్ణకుమారి తెలిపారు. శనివారం మండలంలోని మండ్రాజుపల్లిలో నెల్లూరి భద్రయ్య నివాసంలో ఏర్పాటు చేసిన శ్రీనివాసరెడ్డి అనుచరుల ఆత్మీయ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ బాధ్యులు శివరామకృష్ణ, మండల బాధ్యులు కొడాలి గోవిందరావు, చిదుముల జాన్‌రెడ్డి, వాకా శ్రీనాథ్, సైదులు, పాగర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాల్వలు నిర్మించాలని ధర్నా

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు సత్యనారాయణపురంలోని జంగాల కాలనీలో సైడ్ కాల్వలునిర్మించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం గ్రామ సెంటర్‌లో ధర్నా చేశారు. వర్షాకాల సీజన్‌లో వీధుల్లో మురుగునీరు చేరి దోమలతో వ్యాధులబారిన పడుతున్నామని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని, ఎన్నికల సమయాన పలు రాజకీయ పార్టీల నాయకులు సైడ్ కాల్వలు నిర్మిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సైడ్ కాల్వలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దవెంకయ్య, ఎ.సైదులు, పి.భూషయ్య, పి.శ్రీను, ఎ.పెద్దగంగయ్య, ఎ.పెద్దులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

వినతుల వెల్లువ..

అదనపు కలెక్టర్‌కు..


వినతిపత్రం సమర్పిస్తున్న వీరభద్రం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు తక్షణమే పట్టాలు పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌కు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా వీరభద్రం శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వీరభద్రం మాట్లాడుతూ.. పోడు రైతులకు హక్కు పట్టాలు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని, తక్షణమే ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ డీడీకి..

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎస్సీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అధికారులు పర్యవేక్షణ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, పెట్టెలు అందించాలని కోరారు. నాయకులు వీరేందర్, తరుణ్, శరత్ పాల్గొన్నారు.

తహసీల్దార్లకు..


తిరుమలాయపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: అసంఘిత రంగంలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని శనివారం అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. , కనీస వేతనం రూ. 600 పెంచాలని కోరుతూ రూరల్ టి.సుమ, తిరుమలాయపాలెం తహసీల్దార్ పుల్లయ్య, నేలకొండపల్లి తహసీల్దార్ దారా ప్రసాద్‌లకు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బండెల వెంకయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శివలింగం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ అధ్యక్షుడు సీ.వై.పుల్లయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు లేని సమయంలో రూ.5వేల జీవన భృతి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘం నాయకులు ఎం. మల్లయ్య, వెంకటప్పారావు, శీలం. లెనిన్, కె. రామలింగం, పి.కోటయ్య, డివిజన్ కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రాయిండ్ల చిరంజీవి చుంచు వెంకన్న, వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, చిర్రా భిక్షం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

నేలకొండపల్లి: ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ దారా ప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను కొంతమంది ఆక్రమణకు ప్రయత్నించారని ఫిర్యాదు అందడంతో ఈ బోర్డులు అమర్చినట్లు తెలిపారు. అమర్చిన బోర్డులను తొలగిస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.



ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా ముదిరాజులకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శీలం పాపారావు డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం శవయాత్ర నిర్వహించి, జెడ్పీసెంటర్‌లో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కౌశిక్‌రెడ్డిని వెంటనే కేసీఆర్ బర్తరఫ్ చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రతానపు వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ కొప్పెర జానకి రాములు, ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, రామనాథం, కేశవులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే'


మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో శనివారం నో బ్యాగ్ డేను నిర్వహించారు. నగరంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బాలల సభలో ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణం పరిరక్షణ, గురువులు, చదువుల పట్ల ఉండాల్సిన గౌరవం, క్రమశిక్షణ గురించి విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, సైదులు, మాధవి, సురేష్, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాషువా వర్ధంతి

తిరుమలాయపాలెం: ప్రముఖ కవి గుర్రం జాషువా వర్ధంతి వేడుకల సందర్భంగా శనివారం తిరుమలాయపాలెంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొక్కిరేణి ఎంపీటీసీ గుగ్గిళ్ల అంబేడ్కర్ మాట్లాడుతూ.. తన కవితల రూపంలో సమాజాన్ని మేల్కొల్పిన మహానుభావుడు జాషువా అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు పోలెపొంగు వెంకటేశ్వర్లు, కొమ్ము పూలే, నాగేశ్వరరావు, వీరభద్రం, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, సాల్మన్ రాజ్, తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు వితరణ

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం పాఠశాల విద్యార్థులు రాగి జావ తాగటానికి ఖమ్మంలోని శ్రీలేఖ న్యూరో సెంటర్ రూ.3వేల విలువైన స్టీల్ గ్లాసులను శనివారం పాఠశాలలో విద్యార్థులకు అందించారు. గణేశ్వరం పాఠశాల డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొర్ర శీను, హెచ్ఎం లేడిబోయిన గోపాలరావు, ఉపాధ్యాయులు జ్యోతి, మజ్హర్, విజయలక్ష్మి, అనంత్, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణ దరఖాస్తుల పరిశీలన షురూ

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/రఘునాథపాలెం: బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో అందిస్తున్న రూ.లక్ష రుణం కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన శనివారం నుంచి మొదలైంది. తిరుమలాయపాలెం మండలవ్యాప్తంగా 1,257 మంది దరఖాస్తు చేసుకోగా.. నేలకొండపల్లి మండలవ్యాప్తంగా 1,405 దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టారు. అలాగే, రఘునాథపాలెం మండలవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి వెళ్లి పరిశీలించారు. నేలకొండపల్లి మండలంలో ఎంపీడీఓ జమలారెడ్డి, పంచాయతీ అధికారి సీహెచ్ శివతోపాటు రఘునాథపాలెం మండలంలో ఎంపీడీఓ రామకృష్ణ, మాధంశెట్టి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రుతి తదితరులు పాల్గొన్నారు.


నేలకొండపల్లి: రామచంద్రాపురంలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి


రఘునాథపాలెం: దరఖాస్తుదారుల ఇంటి వద్ద పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ